క్లుప్తంగా

కాల్వను బాగు చేయించాలని వినతి

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి దేవాలయం పక్కన ఉన్న కాల్వను బాగు చేయించాలని శివ మారుతి రామాలయం కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డితో కలిసి దేవాలయానికి వచ్చిన ఎమ్మెల్యేను గ్రామస్తులు కలిసి సమస్యలను విన్నవించారు. దేవాలయం పక్కన ఉన్న చెరువు కాల్వ శిథిలమవడంతో వ్యర్థాలు వర్షాకాలంలో ఆలయం లోపలికి వస్తున్నాయని తెలిపారు. బాగు చేయించి కాల్వపై స్లాబ్ వేయించాలని కోరారు. అదేవిధంగా ఆలయం వద్ద కల్యాణ మండపం నిర్మించడానికి నిధులు మంజూరు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో శెట్టిశేఖర్, ఆలయ కమిటీ చైర్మన్ గిన్నె రాంచంద్రయ్య, వడ్ల సుధాకర్, బాలలింగయ్య, నాగిశెట్టి, సీజీ.మధు, నిశాంత్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

అడ్డాకుల: మండలంలోని పొన్నకల్ చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త బలిజ శేఖర్ రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా శుక్రవారం బాధితుడిని జెడ్పీటీసీ సభ్యుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి పరామర్శించారు. ప్రమాద వివరాలను తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ఈ సందర్భంగా రూ.20వేల నగదును బాధితుడికి అందజేశారు. అదేవిధంగా కొందరు గ్రామస్తులు మరో రూ.40వేలను పోగు చేసి ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహిమూద్, విజయకుమార్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

ఎస్సెస్సీ విద్యార్థులకు టాలెంట్ టెస్టు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఈనెల 18న ఎస్సెస్సీ విద్యార్థులకు ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్టును నిర్వహించనున్నారు. అందుకు సంబంధించిన కరపత్రాన్ని డాక్టర్ ప్రతిభ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరంతరం విద్యారంగ సమస్యలపై పోరాడే విద్యార్థి సంఘం ఎస్‌ఎఫ్‌ఐ అని, చదువుల్లో కూడా విద్యార్థులను ముందుంచేందుకు కృషి చేస్తుందన్నారు. మాడల్ పరీక్షకు ప్రశ్నాపత్రం విద్యావేత్త చుక్కారామయ్య ఆధ్వర్యంలో రూపొందించారని, అన్ని సబ్జెక్టుల ప్రశ్నలు వస్తాయని తెలిపారు. మరింత సమాచారం కోసం 9705985813 నంబర్‌ను సంప్రదించాలన్నారు కార్యక్రమంలో భరత్, నందు, రాము తదితరులు పాల్గొన్నారు.

నంబర్ ప్లేటు లేకుంటే చర్యలు

దేవరకద్ర: నంబర్ ప్లేటు లేకుండా వాహనాలను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ నాగన్న తెలిపారు. శుక్రవారం రాయచూర్ రహదారిపై చేసిన తనిఖీల్లో నంబర్ ప్లేటు లేకుండా నడుపుతున్న 5 బైక్‌లను సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ వాహనాలకు తప్పని సరిగా నంబర్ ప్లేటు ఉండాలని, రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, రోడ్డు నిబంధనలు పాటించాలని తెలిపారు.

బీమా ఉద్యోగులకు వేతన సవరణ చేయాలి

జడ్చర్ల: బీమా ఉద్యోగులకు వేతన సవరణ చేయాలని స్థానిక జీవిత బీమా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వేణుగోపాల్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. వేతనాలు సరిపోక ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రీమియంపై జీఎస్టీని, ఎన్‌పీఎస్‌ను రద్దు చేయాలని కోరారు. 16న కేంద్ర కార్మిక సంఘాలు చేపట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చెన్నయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ పనులకు సమాయత్తం

నవాబుపేట: వేసవిలో చేపట్టే ఉపాధి పనులపై సిబ్బంది సమాయత్తం కావాలని డీఆర్‌డీఓ యాదయ్య తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఉపాధి, ఐకేపీ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. వేసవిలో చేపట్టే పనులను ప్రాధాన్యత క్రమంలో ఉంచాలని సూచించారు. ఐకేపీ సిబ్బంది మహిళా సంఘాల ఆన్‌లైన్ విధానం లోకో యాప్‌ను త్వరగా పూర్తి చేసేలా చూడాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్, ఈజీఎస్ ఏపీఓ జ్యోతి, రమాదేవి, కాంచన తదితరులు పాల్గొన్నారు.

పేట, కొడంగల్ ఎత్తిపోతలతో సస్యశ్యామలం

కోయిల్‌కొండ: నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం రూ.2945.50కోట్ల నిధులు మంజూరు చేస్తూ గురువారం జీఓ విడుదల చేయడంపట్ల నారాయణపేట యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రవినాయక్ హర్షం వ్యక్తం చేశారు. ఈ పథకం ద్వారా లక్షకుపైగా ఎకరాలు సాగులోకి వస్తాయని తెలిపారు. పేట ప్రజల ఎన్నో ఏళ్ల కళ నెరవేరడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసిందని పేర్కొన్నారు.

‘అందరినీ మోసం చేసిన కేసీఆర్’

- సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శిస్తే ప్రజలు తరిమికొడతారు
- సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి



భూత్పూర్‌లో మాట్లాడుతున్న చల్లా వంశీచంద్‌రెడ్డి

భూత్పూర్/అడ్డాకుల: బీఆర్‌ఎస్ పాలనలో కేసీఆర్ అందరిని మోసం చేశారని, నిరుద్యోగులకు ఉద్యోగాలు, మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని హామీలిచ్చి నెరవేర్చలేదని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్ విమర్శించారు. శుక్రవారం రాత్రి భూత్పూర్ చౌరస్తాలో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డితో కలిసి పాలమూరు న్యాయ యాత్ర చేపట్టారు. అమిస్తాపూర్ వద్ద సాక్షి గణపతి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పాదయాత్రగా వచ్చి భూత్పూర్‌చౌరస్తాలో కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లా వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల కోసం పనిచేసే సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేస్తే ప్రజలే తరమి కొడతారని, బీఆర్‌ఎస్ నాయకుల మాటలు నమ్మే పరిస్థితి లేదన్నారు. షాద్‌నగర్‌లో జరిగిన సమావేశంలో కేసీఆర్ మైనార్టీలకు 12శాతం రిజర్వేషన్ ఇస్తానని మోసం చేశారని, విద్యా, ఉద్యోగాల్లో సైతం రిజర్వేషన్ కల్పించాలని ముస్లింలు కోరితే రిజర్వేషన్లు కల్పించలేదన్నారు. యాదవులకు గొర్రెలు ఇస్తామని చెప్పి వారితో రూ.కోట్లు కట్టించుకుని, గొర్రెలు ఇవ్వలేదన్నారు. దేవరకద్ర నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యేగా మధుసూదన్‌రెడ్డిని ఎలా గెలిపించారో అదేవిధంగా ఎంపీగా నియోజకవర్గంలో అత్యధికంగా ఓట్లు వేసేలా కృషి చేయాలని ఆయన కోరారు.

ఆరు గ్యారంటీలు అమలు చేసి తీరుతాం: ఎమ్మెల్యే

సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఇప్పటికే రెండు గ్యారంటీలు అమలు చేశారని, త్వరలోనే గృహలక్ష్మి ద్వారా 200 యూనిట్ల వరకు విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్, రుణమాఫీ, రైతుభరోసా ఇచ్చి తీరుతామని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. రూ.లక్ష కోట్లు దోచుకుని ఖజానాను ఖాళీ చేసిన బీఆర్‌ఎస్ పార్టీ తెలంగాణను అధోగతి పాలు చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలోనే కోయిల్‌సాగర్, కల్వకుర్తి, నాగర్జున సాగర్ ప్రాజెక్టులు నిర్మించారని, కేసీఆర్ నిర్మించిన ప్రాజెక్టులు నాసిరకంగా చేపట్టడంతో కూలుతున్నాయని విమర్శించారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును 3ఏళ్లలో కుర్చీ వేసుకుని పూర్తి చేస్తామన్న కేసీఆర్ 9 ఏళ్లయినా పూర్తి చేయలేదని, ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన కర్వెన గ్రామ రైతులకు ఇంటికో ఉద్యోగం, భూమికి భూమి ఇవ్వకుండా మోసం చేశారన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, నవీన్‌గౌడ్, విజయ్‌గౌడ్, అబ్బుబాకర్ సిద్దికి, పద్మ పాల్గొన్నారు.

దోచుకోవడమే లక్ష్యంగా పని చేశారు

రాష్ట్రంలో పాలన సాగించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాల అసమర్థత వల్లే కాంగ్రెస్ పార్టీ పాలమూరు న్యాయ యాత్ర చేయాల్సి వచ్చిందని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డితో కలిసి అడ్డాకుల, కొమిరెడ్డిపల్లి, మూసాపేట, జానంపేటలో శుక్రవారం ఆయన పర్యటించారు. గత ప్రభుత్వం దోచుకోవడమే లక్ష్యంగా పని చేసిందని విమర్శించారు. ఇప్పుడు బీఆర్‌ఎస్ పార్టీకి ఎంపీ అభ్యర్థులే కరువయ్యారని ఎమ్మెల్యే విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్ కనుమరుగవుతుందన్నారు.

మోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయం



యన్మన్‌గండ్లలో మాట్లాడుతున్న శాంతకుమార్

నవాబుపేట: మూడోసారి మోదీ ప్రధాని కావటం ఖాయమని బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతకుమార్ చెప్పారు. పల్లెకుపోదాం కార్యక్రమంలో ఆయన మండలంలోని యన్మన్‌గండ్లలో 24 గంటలు గడిపారు. శుక్రవారం గ్రామంలో పర్యటించి ప్రజలకు మోదీ పాలనపై ఉన్న అభిప్రాయాలు తెలుసుకున్నారు. చేపట్టిన పలు పథకాలు ప్రజలకు వివరించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోదీ దేశానికి కారణజన్ముడని తెలిపారు.

బీసీలంటే డీకే అరుణకు అభిమానం

బీసీలంటే డీకే అరుణకు చాలా అభిమానమని, పాలమూర్ టికెట్ బీసీలకు వస్తే ఆమె పార్టీ గెలుపులో ప్రధాన పోషిస్తారనే నమ్మకం మాకుందన్నారు. అధిష్టానం పలు మార్లు తనకు ఇచ్చిన బాధ్యతను సమర్థవర్తంగా నెరవేరుస్తూ వస్తున్నానని, అందుకే తనకు పాలమూరు ఎంపీగా పోటీ చేసే అవకాశం వస్తుందనే నమ్మకం ఉందన్నారు. సమావేశంలో ప్రతాప్‌రెడ్డి, రాజు, యాదయ్య, శ్రీనివాస్, రమేష్ తదితరులు ఉన్నారు.

మోదీకి మద్దతు ఇవ్వాలి

పాలమూరు: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి ప్రధాని మోదీకి మద్దతుగా నిలవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పల్లెకు పోదాం పదండి కార్యక్రమాన్ని పట్టణంలోని న్యూగంజ్‌లో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన హాజరై జాతీయ స్థాయి విజయాలు అనే కరపత్రాలను పంపిణీ చేశారు.

వేతనాలు విడుదల చేయాలని ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశా కార్యకర్తలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఆశా కార్యకర్తల రెండు నెలల వేతనాన్ని వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దీప్లానాయక్, నల్లవెల్లి కురుమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట 400మంది ఆశా కార్యకర్తలతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం శాసనసభ ఎన్నికలకు ముందు ఆశాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఆరు గ్యారంటీల అమలులో భాగంగా వారితో సర్వే చేయించాలనే ఆలోచన పనిభారాన్ని పెంచుతుందన్నారు. వివిధ రకాల రికార్డులను నమోదు చేయాలని అధికారులు వేధింపులకు పాల్పడుతున్నారని, వాటిని తక్షణమే ఆపాలన్నారు. ముఖ్యంగా ఫిక్స్‌డ్ వేతనం అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ, ప్రమాద బీమా, రిటైర్మెంట్ సందర్భంలో రూ.5లక్షలు ఇవ్వాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్ ఏఓ శంకర్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి రాజ్‌కుమార్, సావిత్రి, లక్ష్మి, యాదమ్మ, పద్మ, అమృత, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్య తీసుకోండి



వినతిపత్రం ఇస్తున్న దళిత నాయకులు

హన్వాద: మండలంలోని తిరుమలగిరికి చెందిన మాజీ సర్పంచ్ బాలకిష్టయ్య, అతని కుమారుడు విజయ్‌కుమార్‌పై ఇబ్రహీంబాద్‌కు చెందిన కొత్త అంజిల్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి హత్యాయత్నం చేశారని దళిత సంఘాల నాయకులు శుక్రవారం కలెక్టరేట్ ఏఓ. శంకర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. 12మంది రైతుల పొలాలకు ఉన్న బాటను ఆక్రమించుకున్న అంజిల్‌రెడ్డి ఇటుక బట్టీల పరిశ్రమ పెట్టారని, 35ఏళ్లుగా ఉన్న బాటను ఆక్రమించుకున్న విషయమై ప్రశ్నించిన బాలకిష్టయ్య, అతని కుమారుడిపై హత్యాయత్నానికి పాల్పడ్డారన్నారు. కార్యక్రమంలో వెంకటయ్య, శ్రీనివాసులు, కుర్మయ్య, ఆనంద్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి గ్యాస్ కనెక్షన్ సర్వే



దేవరకద్రలో సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

దేవరకద్ర: పట్టణంలో శుక్రవారం నిర్వహిస్తున్న ఇంటింటి గ్యాస్ కనెక్షన్ సర్వేను మండల అధికారులు పరిశీలించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి గ్యాస్ కనెక్షన్‌కు సంబంధించిన వివరాలను నమోదు చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలలో ఒకటైన రూ. 500లకే గ్యాస్ సిలిండర్ ఇస్తామని ఎన్నికల సందర్భంగా చేసిన వాగ్దానాన్ని అమలు చేయడానికి సర్వేను చేపట్టారు. గతంలో ఆరు గ్యారంటీల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల జాబితాలతో ఇళ్లకు వెళ్లి గ్యాస్ కనెక్షన్ నంబర్, రేషన్‌కార్డు, ఆధార్ కార్డు వివరాలను నమోదు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్నా ప్రతి లబ్ధిదారుని వివరాలను నమోదు చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి రవీంద్రనాథ్ కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఈఓ సీత్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

వెంటనే ఆన్‌లైన్ చేయాలి

నవాబుపేట: వంటగ్యాస్‌కు రాయితీ కోసం గ్యాస్ కనెక్షన్ నంబర్‌లను ఆన్‌లైన్ చేసి వెంటనే అందించాలని మండల ప్రత్యేకాధికారి సుధాకర్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఇందిరమ్మ అభయ హస్తం దరఖాస్తులను పరిశీలించి గ్యాస్ కనెక్షన్ నంబర్ల ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం త్వరలో గ్యాస్ రాయితీ ఇచ్చే అవకాశం ఉందని అందుకు, ఆన్‌లైన్ ప్రక్రియ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జున్‌రావు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్, ఈఓపీఆర్‌డీ భద్రునాయక్ పాల్గొన్నారు.

సంతలో తూకాల మోసం

బాలానగర్: మండల కేంద్రంలో ప్రతి శుక్రవారం నిర్వహించే సంతలో తూనికల్లో పెద్ద మొత్తంలో మోసం చేస్తున్నారని కొనుగోలుదారులు చెబుతున్నారు. కిలో చేపలకు 700 గ్రాములు కూడా ఉండడం లేదని 70 శాతం చేపల విక్రయాలదారుల వద్ద గుర్తింపుతో ఉన్న బాట్లు లేవని చెబుతున్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల ముందే చేపల విక్రయాలు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారు. ఈ విషయంపై గతంలో అధికారుల ఫిర్యాదుతో తనిఖీలు చేసినా తీరు మారలేదని స్థానికులు చెబుతున్నారు.

ట్రస్మా జిల్లా అధ్యక్షుడికి సన్మానం

మహబూబ్‌నగర్ రూరల్: ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా లక్ష్మణ్, పట్టణ అధ్యక్షుడిగా ఎన్నికైన వంశీ మోహన్‌రెడ్డిలను మాదిగ విద్యార్థి జేఏసీ, మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. స్థానిక ఎస్సీ కమ్యూనిటీహాల్‌లో వారికి శాలువలు కప్పి పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో గోపాల్, బొర్ర సురేష్, యాదయ్య, రాములమ్మ, నరేష్ పాల్గొన్నారు.

మీనాంబరంలో మాస శివరాత్రి ఉత్సవాలు

జడ్చర్ల: మండలంలోని అల్వాన్‌పల్లి సమీపంలో మీనాంబరం ఆలయంలో మాస శివరాత్రిని పురస్కరించుకుని గురువారం రాత్రి పరశువేదీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రుద్రాభిషేకం, పల్లకీసేవ, ప్రసాద వితరణ, భజనలు చేపట్టారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

జడ్చర్ల: స్థానిక ప్రభుత్వ బీఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలలో 2019 నుంచి 2023 విద్యా సంవత్సరాలకు సంబంధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శుక్రవారం ప్రతిభా పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రి న్స్‌పాల్ చిన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

15న ఊరంచుతండా సేవాలాల్ ఉత్సవం

నవాబుపేట: సేవాలాల్ జయంతి సందర్భంగా 15న మండలంలోని ఊరంచుతండాలో కొత్తగా నిర్మించిన సేవాలాల్ దేవాలయంలో మహాభోగ్ నిర్వహిస్తున్నట్లు సేవాలాల్ ఉత్సవ సమితి నాయకులు లింబ్యానాయక్, రాములు, శంకర్‌నాయక్, నర్సింహనాయక్ శుక్రవారం తెలిపారు. ప్రతి గిరిజనతండా తరలిరావాలని కోరారు.

ఇద్దరికి గాయాలు

జడ్చర్ల: మండలంలోని బూరెడ్డిపల్లి శివారులో జాతీయ రహదారిపై శుక్రవారం రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. బూరెడ్డిపల్లి క్రాస్ రోడ్ వద్ద రోడ్డు దాటుతున్న బైక్‌ను బెంగుళూరు వైపు వెళ్తున్న కారు ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న భీమయ్య, రాంజీ గాయపడ్డారు. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు.

విద్యాభివృద్ధికి దాతల సహకారం

అడ్డాకుల: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి దాతలు సహకారం ఇవ్వాలని డీఈఓ రవీందర్ పిలుపునిచ్చారు. మండలంలోని రాచాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాభివృద్ధి వేదిక ప్రతినిధులు శుక్రవారం 50 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో నైపుణ్యాన్ని పెంచుకుని చదివితే జీవితంలో ఉన్నత స్థాయికి ఎదుగుతారని చెప్పారు. పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జేఎస్‌టీయూ డైరెక్టర్ డాక్టర్ జయలక్ష్మి, ఏఎంఓ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ పాశం తిరుపతయ్య, సీఎంఓ బాలుయాదవ్, హేమచంద్రుడు, చెన్నారెడ్డి, రవీందర్‌రెడ్డి, జగన్నాథం, హెచ్‌ఎం ఫయాజుద్దిన్, ఉపాధ్యాయులు ఉన్నారు.

విద్యార్థినికి డీఈఓ అభినందన

మూసాపేట మండలం నిజాలాపూర్ చెందిన జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని భవానీ ఇటీవల ఢిల్లీలో జాతీయ స్థాయి కళా ఉత్సవ్–2023 పోటీల్లో పాల్గొని 3డీ విజువల్ ఆర్ట్స్‌లో తెలంగాణకు ప్రాతినిథ్యం వహించింది. దీంతో డీఈఓ పాఠశాలను సందర్శించిన సందర్భంలో భవానీని అభినందించి రూ.వెయ్యి నగదును అందజేశారు. గైడ్ టీచర్ సరితను కూడా అభినందించారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి

రాజాపూర్: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని తిర్మలాపూర్‌లో విశ్వమానవతసేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. తిర్మలాపూర్ గ్రామాన్ని దత్తత తీసుకుని విద్యా, వైద్యాన్ని ఉచితంగా అందించడం తమ గ్రామప్రజల అదృష్టమన్నారు. గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు చేసి 1500 పుస్తకాలను అందజేస్తామని విశ్వమానవతసేవా సంస్థ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌చౌదరి, మహిపాల్‌రెడ్డి, రామకృష్ణగౌడ్, బాలకృష్ణ, భీమయ్య, సుజాత, విద్యాసాగర్‌రెడ్డి, యాదగిరి పాల్గొన్నారు.

పీయూ అధ్యాపకుడికి డాక్టరేట్



రవికుమార్‌ను అభినందిస్తున్న వీసీ తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ అధ్యాపకుడు శేకుంటి రవికుమార్‌కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రధానం చేసింది. ఈమేరకు ఓయూ ప్రొఫెసర్ పద్మావతి పర్యవేక్షణలో ఆయన పరిశోధన కొనసాగించారు. ‘సింథసిస్ అండ్ డీపీటీ స్టడీస్ ఆఫ్ బయోలజికల్ యాక్టివ్ బెంజోమెట్స్, బెంజ్ మైట్స్, సల్ఫోనేటెడ్ అండ్ సల్ఫోనమైడ్ నోవెల్ లూయిస్ బేస్ డీఎంఏపీ ఆడక్ట్స్’ అంశంపై పరిశోధన పత్రం సమర్పించారు. పరిశోధన పత్రం జాతీయ, అంతర్జాత జర్నల్స్‌లో సైతం ప్రచురితమైంది. డాక్టరేట్ పొందినందుకు రవికుమార్‌ను పీయూ వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్, ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, కృష్ణయ్య తదితరులు అభినందించారు.

శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలి



అవగాహన సదస్సులో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాల్సిన అవసరం ఉందని ఎన్టీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. కళాశాలలో విజ్ఞాన దర్శిని ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శాస్త్రీయ అవగాహన ఉండడం వల్ల సమాజంలో జరిగే మోసాలు, అశాస్త్రీయ అంశాలపై అప్రమత్తంగా ఉంటారన్నారు. బానామతి, చేతబడి తదితర మూఢనమ్మకాలను నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన దర్శిని అధ్యక్షుడు రమేష్, వైస్ ప్రిన్సిపాల్ గంగాధర్, పుష్పలత, సుధాకర్, భరత్, మహేష్ పాల్గొన్నారు.

ఘనంగా పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవం



పీఆర్టీయూ జెండాను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీఆర్టీయూ సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. అధ్యక్ష, కార్యదర్శులు నారాయణగౌడ్, రఘురాంరెడ్డి సంఘం జెండాను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కొన్నేళ్లుగా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం పీఆర్టీయూ కీలకంగా వ్యవహరిస్తుందని, 80వేల మంది సభ్యులున్న సంఘంగా రాష్ట్రంలోనే పెద్దగా ఆవిర్భవించిందన్నారు. ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన ముగ్గురు ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు గోపాల్‌నాయక్, మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవం

జడ్చర్ల: పట్టణంలో శుక్రవారం పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యాలయం వద్ద జెండావిష్కరణ అనంతరం ఉద్యోగ విరమణ పొందిన పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో సత్యనారాయణ, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అటవీశాఖ అధికారి చేతివాటం?

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా అటవీశాఖలో పనిచేసే ఓ అధికారిణి రోడ్ల వెంట చెట్టు నరుకుతున్న వ్యక్తులు నుంచి డబ్బులు తీసుకునే విమర్శలు గుప్పుమన్నాయి. గురువారం మధ్యాహ్నం పిస్తాహౌజ్ వద్ద సదరు అధికారిణి చెట్లు నరికే వ్యక్తి వద్ద బేరసారాలు ఆడుతూ చివరికి రూ.8వేలు తీసుకుని అక్కడి నుంచి ద్విచక్ర వాహనంపై వెళ్లిపోయినట్లు తెలిసింది. అడవులు, చెట్లను రక్షించాల్సిన శాఖలో విధులు నిర్వహిస్తున్న అధికారి వంత పాడటం సరికాదని పలువురు చెబుతున్నారు. ఈ విషయంపై జిల్లా అటవీశాఖ అధికారి సత్యనారాయణను వివరణ కోరగా అనుమతి లేకుండా ఎవరూ చెట్లు నరికినా వాళ్లా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. అలాంటి వ్యక్తులకు శాఖ సిబ్బంది ఎవరూ సహకరించిన వారిపై శాఖపరమైన చర్యలు ఉంటాయి. ఈ ఘటనపై విచారణ చేసి సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం.

సైబర్ నేరాలతో ప్రతి విద్యార్థి జాగ్రత్త



మాట్లాడుతున్న మేనేజర్ రామారావు

హన్వాద: ప్రతి విద్యార్థి సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని ఏపీజీవీబీ మేనేజర్ రామారావు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మునిమోక్షం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏపీజీవీబీ ఆధ్వర్యంలో ఆర్థిక పొదుపు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. చిన్ననాటి నుంచి డబ్బు పొదుపు చేయాలన్నారు. కార్యక్రమంలో సురేష్‌రెడ్డి, హెచ్‌ఎం ఆబేదాబేగం తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం: కేసు నమోదు

అడ్డాకుల: మండలంలోని గుడిబండకు చెందిన వివాహిత మాధవి అదృశ్యమైన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఈనెల 5న మాధవి హైదరాబాద్‌కు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి గుడిబండ నుంచి మధ్యాహ్నం 12 గంటలకు టోల్‌ప్లాజా వద్ద హైదరాబాద్ బస్సు ఎక్కింది. అయితే హైదరాబాద్‌లో ఉండే భర్త వద్దకు వెళ్లకపోవడంతో కుటుంబ సభ్యులు అంతటా వెతికారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో తల్లి హైదరాబాద్‌లోని వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అక్కడి పోలీసులు జీరో ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. కేసును అడ్డాకులకు బదిలీ చేయడంతో శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.